కథా నిలయం
3573
శ్రీకాకుళం

# ఎవరికి ఎవరు?

"రేపు ముఖ్యమంత్రిగారొస్తార్టగా....!"

"నిన్నే మంత్రిగారొచ్చారు గందా!"

"ఔను, రేపు ముఖ్యమంత్రిగారొస్తారని తెలిసే ఆ మంత్రిగారు ముందొచ్చి వెళ్లార్ట!"

"అయనగారేమిచ్చి వెళ్లారని ఈయనగారు రావడం? శుష్క వాగ్దానాలూ, శూన్య హస్తాలూనూ. ఎదవగోల." అందామనుకున్న పైడిరాజు గొంతు పెగల్లేదు. నాలుకలో ముల్లిరిగినట్టయింది. ఎటు బోయి ఎటొస్తుందో.

పైడిరాజు మూన్నెళ్ల కూతురు పంచ ప్రాణాలరచేతిలో కొచ్చినట్టు - గుక్కపట్టి ఏడుస్తోంది. ఆ బుజ్జి ముండనెలా సముదాయించాలో అర్థంగాక చిర్రెత్తిపోతుందతనికి. అర్థాంగి గంగ పరిస్థితి గూడా అంతే. దిక్కులు చూస్తూ కూచుంది.

నాల్రోజుల క్రితం....

గంగమ్మ తల్లినే నమ్ముకుని పొట్టబోసుకుంటున్న వాళ్లెవ్వరూ సముద్రంలోకి వెళ్లరాదనే హెచ్చరిక కాళ్లూ చేతులు కట్టి పడేసింది.

ఫూటుగా తాగిన పోరంబోకు కోపతరంగాలకు మల్లే ఉవ్వెత్తున లేచి ఫెడేల్ ఫెడేల్‌మని ఒడ్డుకు తలబాదుకుంటున్న సముద్రపు అలలు గందరగోళం సృష్టిస్తున్నాయి. రేసు గుర్రాల్లా పరుగెత్తుకొస్తున్న ఈదురు గాలుల హోరు చెవులకు తూట్లు పొడుస్తూంది. నీరు కలవని పాలలా స్వచ్ఛంగా, కాచి వడబోసిన నీరులా శుభ్రంగా కనిపించిన ఆకాశం రంగులు మార్చి విర్రవీగుతూంది- అధికార పార్టీలోకి అప్పుడే ప్రవేశించిన రాజకీయ నాయకుడిలా.

అందరి గుండెల్లో గుబగుబలు.

బలహీనుల లబలబలు.

బోరుమని ఏడ్వాలనిపించింది గంగకు.

అధికారుల ఆదేశం లోతట్టు ప్రాంతాల్లో సంచలనం రేపింది.

మూటా ముల్లే సర్దుతున్నారు.

ఒకరి మీదొకరు పడి ఏడుస్తున్నారు.

కొన్ని గంటలు హాహాకారాలతో అంగలార్చిన గూడెం మూగదై మరుభూమిగా మారింది.

తమ పాక వదిలి అదరబాదరాగా సురక్షిత (పునరావాస కేంద్రం) ప్రాంతాని కొస్తుంటే కళ్లమ్మట నీళ్లాగలేదు పైడిరాజుకు.

మూడేళ్ల క్రితం - గంపెడాశల్ని మూట గట్టుకుని తనతో మూడు ముళ్లు వేయించుకున్న గంగ మూడు నెలల బాలింత. చంకలో పాపనెత్తుకుని శత్రుదేశం సైనికులు తరుముకొస్తున్నట్టు భర్త వెంట పరుగెత్తింది.

తనను కట్టుకుని అసలేం సుఖపడిందని గంగ! పెళ్లయిన సంవత్సరం దాకా సవతి అత్త సాధింపులూ, సిగపట్లు భరించింది. ఆ తర్వాత పెళ్లై సంవత్సరం గడిచినా కడుపు పండలేదని లోకులు కాకులై పొడుచుకు తింటూంటే పరమేశ్వరుణ్ని ప్రార్థించిందే తప్ప పల్లెత్తు మాటన్లేదెవర్నీ. ఎన్నో నోములు నోచింది. ఉపవాసాలు చేసింది. నోము ఫలించిందన్న సంతోషం సందిగ్ధంలో పడిపోయింది. చంటి గుడ్డుకు సరిపోయే పాలు గంగకు ప్రసాదించలేదా భగవంతుడు. డబ్బాపాలు వాడి తీరాలన్నాడు డాక్టర్. పైడిరాజు అంతరంగంలోంచి ఓ వేడి నిట్టూర్పు తోసుకొచ్చింది. అసలు లేనత్త కంటే గుడ్డత్త నయం గదా!..... సరిపెట్టుకోక తప్పలేదు. ఏడుస్తున్న గంగను నవ్వించగలిగాడు.

ఐదొందల మంది కోసం కట్టించిన పునరావాస కేంద్రం ఐదువేలమందితో కిటకిటలాడ్తుంది. ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నారు. దిక్కులేక ఓ మూల పడుకుంటున్నారు నిరాశ్రయులు.

మొదట చిన్నగా ప్రారంభమైన వర్షం కొద్దిసేపట్లో కుండపోతైంది. భయంకరమైన ఈదురు గాలులకు తట్టుకోలేక నరికినట్టు పడిపోతున్నాయి చెట్లు. గుడిసెలు గాల్లో కెగిరి పోతున్నాయి.

రెండో రోజు తుఫాను వర్షం జోరు తగ్గలేదు. ఈదురు గాలుల వేగం ఎంత హెచ్చిందంటే పునరావాస కేంద్రం ఏ క్షణంలోనైనా ఎగిరిపోవచ్చునే అనుమానమొచ్చింది. వృద్ధుల హాహాకారాలు, పసిపిల్లల ఏడ్పులు గాలి తరంగాల్లో కలిసిపోతున్నాయి.

రోజంతా ఉపవాసం. చంటిదాని ఆకలి కేకలు ఆకాశాన్నంటుతున్నాయి. పైడిరాజు దంపతులు అల్లాడిపోతున్నారు.

ప్రభుత్వం పొట్లాలు పంపిస్తుందన్నా రెవరో. నోళ్లు తెరచుక్కూచున్నారంతా.

పైడిరాజు పాప గుక్కపట్టి ఏడుస్తూనే ఉంది.

ఆకలి.... ఆకలి.... తట్టుకోలేని ఆకలి.

ఆకలి వరదల నాపేదెట్లా?

ఆత్మారాముడు శాంతించేదెట్లా?

ఇంకాస్సేపట్లో పొట్లాలు వస్తాయంట. వస్తాయి. తప్పకుండా వస్తాయి. వచ్చి తీరాలి.

కాని... పొట్లాలు రాలేదు. కేంద్రం చుట్టూ నీరు అలుముకుంది. ఆకాశం ఉరుముతుంది. మెరుపులు చిమ్ముతూంది. మబ్బులు మైమరచి చెమ్మా చెక్కా లాడుకుంటున్నాయి. చీకటి.... అంతా చీకటి... అది రాత్రో పగలో అర్థంగాని చీకటి. కాని అది పగలే. ఔను... పగలే అనుకోవాలి.

గంగ పాపకు పాలివ్వాలని ప్రయత్నించింది. ఒక్క నిమిషం చప్పరించి వదిలేసిన పాప మరింత గట్టిగా ఏడుపు లంకించుకుంది.

పైడిరాజు వీపు మీదెవరో గట్టిగా చరిచినట్టనిపించింది.

పాలివ్వగల తల్లులెవరైనా ఉన్నారేమోనని వాకబు చేశాడు. ప్చ్... లేరు. ఆ(..... ఉంది. ఒకావిడుంది. ఆరునెలల బాబుకు పాలిస్తూంది. ఆదరాబాదరాగా ఆమె వద్ద కెళ్లి అమాంతం కాళ్లు పట్టుకున్నాడు. తన పాప గ్గూడా పాలిచ్చి ప్రాణదానం చెయ్యమని బతిమాలాడు.

"మరి నా కొడుక్కెలా?" వెనకా ముందాడిందావిడ. కాని ఆందోళన దోబూచులాడుతున్న పైడిరాజు చూపులు కరిగించాయా తల్లి హృదయాన్ని.

ఐదు నిమిషాలు పైడితల్లి పాపగ్గూడా పాలిచ్చింది. పాప శాంతించింది. ఆ తల్లికి మరోసారి దండం బెట్టాడు.

వరండా గూడా ఖాళీ లేని కేంద్రం జనసందోహాన్ని భరించలేకపోతుంది.

సముద్రం యుద్ధభేరి మోగిస్తూనే ఉంది.

పగబట్టిన పాము కరిచేదాకా విడవదన్నట్టు - వర్షం కురుస్తూనే ఉంది.

చలి... చలి.... చల్లని చలి. మంచు వర్షంలాగుంది. అబ్బా చలి... ఎముకలు కొరికేస్తుంది. వెంట తెచ్చుకున్న గుడ్డలు ముద్దలైనాయి. అబ్బా చలి.. హమ్మా చలి.

పాప వణుకుతూనే నిద్రబోతుంది.

మళ్లీ తెల్లవారింది కాబోలు. కేంద్రములో వెలుగు రేఖలు విస్తరిస్తున్నాయి.

అది మూడో రోజు.

ఆకలి... ఆకలి... నరాలను నలిపేసే ఆకలి. పేగుల్ని కొరుక్కుతినే

ఆకలి. ప్రాణాలను నిలువునా తోడేసే ఆకలి. ఆందోళన... అసహనం... నిస్సహాయత.

జలుబు, జ్వరంతో కుస్తీ పడుతున్న ఓ ముసలావిడ శాశ్వత నిద్రలోకి జారుకుంది. గొల్లుమన్నాయి కొన్ని కంఠాలు.

అమ్మా.... ఆకలే అంటూ తల్లడిల్లుతున్న పిల్లల మొహాలు చూడలేకపోతున్నారు తల్లిదండ్రులు.

ఒకటికీ, రెంటికీ బయటకెళ్లడానికి భయపడ్తున్నారు పిల్లలు. దుర్వాసన గుప్పుమంది. మీ పిల్లలంటే మీ పిల్లలని తిట్టుకుంటున్నారు పెద్దలు.

పైడిరాజు పాప ఉలిక్కిపడి నిద్ర లేచింది. రాగాలాపన ప్రారంభించింది. పాలులేని గంగ రొమ్ము మళ్లీ పాప నోట్లో కెళ్లింది. కాస్సేపు చప్పరించి తాత్కాలికంగా నోర్మూసుకుంది పాప.

కొన్ని వేల జతల కళ్లు కేంద్రం బైటికీ, ఆకాశం వైపూ చూస్తున్నాయి. వర్షం ముసురుగా మారింది.

పట్టణం రోడ్ల మీది నీరు కేంద్రం చుట్టూ అలుముకున్న నీటితో కలిసి పెద్ద శబ్దంతో ప్రవహిస్తోంది. పశు కళేబరాలు, కూలిపోయిన ఇళ్ల అవశేషాలు మరింకేవేవో కొట్టుకు పోతున్నాయి.

గంటలు భారంగా గడుస్తున్నాయి.

చలి చంపేస్తోంది. ఆకలి దంచేస్తోంది. తినేందుకెవరి వద్దా ఏమీ లేవు.

పొట్లాలు రావా! రావాలే! వస్తాయి. పంపిస్తారు అదో ఆకాశంలో ఏదో శబ్దం. అది హెలీకాప్టర్‌లాగుంది. ఇంటి పైకప్పుల మీద కూచున్న జనాలు లేచి నిల్చున్నారు ఆశగా.

పది నిమిషాలు గగన విహారం చేసి తోక ముడిచింది హెలీకాప్టర్. కంటినీరు తెరుచుకున్న నోళ్లల్లో కెళ్లింది ఉప్పగా.

మధ్యాహ్నం వరకు నీటిమట్టం తగ్గింది. పైడిరాజు పాప మరికొందరితో శృతి కలిపింది. ఏడుపు... ఒక్కటే ఏడుపు. గంగకేం చెయ్యాలో తోచలేదు. ఏడ్చి ఏడ్చి పాప ఏమైపోతుందోననే భయం పీడిస్తుంది. నిన్నటి తల్లి ఎక్కడుందోనని కేంద్రమంతా వెతికాడు పైడిరాజు నిరాశే ఎదురైంది.

"ఊరుకోమ్మా...ఊరుకోవే!" తన వంతు ప్రయత్నం చేశాడు పాప నెత్తుకుని లాభం లేదు.

బజార్లో నీటి మట్టం మరింత తగ్గింది. మళ్లీ ఆకాశంలో హెలీకాప్టర్ శబ్దం.

మళ్లీ అలజడి. తడుస్తూ బజార్లో కొచ్చారంతా. హెలికాప్టర్‌లోంచి పొట్లాలు జారిపడుతున్నాయి. ఒకరికొకరు శత్రువుల్లా తిట్టుకుంటూ, నెట్టుకుంటూ అందుకుంటున్నారు. ఇళ్ల పైకప్పులు ఖాళీ చేసి నేలమీదికొచ్చారంతా. నీటిలో ఉరుకులు, పరుగులు, కుమ్ములాటలు.

పైడిరాజుకో పొట్లం దొరికింది. గంగ ముందు పొట్లం విప్పుకుంది. పులిహోర.. కమ్మని పులిహోర... గుమగుమలాడే పులిహోర... అమృత దాయిని అది

గబగబా తానింత నోట్లో కుక్కుకుని మిగితాది గంగ ముందుంచాడు తినుమని.

"నా కొద్దు. నేతిన్ను!" అంది గంగ కను కొలుకుల్లోంచి దూసుకొస్తున్న కన్నీటి బొట్లతో పాప చెంపలు మెరుస్తున్నాయి. గుండెల్నెవరో గట్టిగా పిండినట్టనిపించింది పైడిరాజుకు. అతనికి తెలీకుండానే కళ్లు తడయ్యాయి.

"ఫర్వాలేదు. తినుగంగా!... బలవంతంగా నోట్లో కుక్కాడు. కళ్లల్లో ఊరిన నీరు బయట పడకుండా జాగ్రత్త పడుతూ.

పాపకు కాసిని నీళ్లు పట్టారంతే.

సాయంత్రానికి పరిస్థితి మరికాస్త మెరుగైంది. సముద్రం హోరు తగ్గింది. బలహీనమైన సూర్య కిరణాలు నీళ్ల మడుగుల్లో తేల్తున్నాయి. మెరుస్తున్నాయి గూడా.

వరుసగా పది జీపులొచ్చాయొకేసారి. పోలీసులు, కార్యకర్తల మధ్య మంత్రిగారొస్తున్నారు. పైడిరాజు పాప శక్తినంతా కూడ దీసుకుని ఏడుస్తూ స్వాగతం పలికింది. కానీ ఆ స్వాగతం కేంద్రములోనే ఆగిపోయింది. జనాలంతా బయటి కొచ్చేస్తున్నారు.

ఎవరెవర్నో ఏదేదో అడుగుతున్నారు, మంత్రిగారు హుషారుగా విషాదాన్ని మేళవించి.

"ఈ రోజు ఉదయమే పులిహోర పొట్లాలు అందించాం సార్!" చేతులు కట్టుకుని విన్నవించాడో ఆఫీసర్.

"మంచినీటి పాకెట్లు గూడా అందించాం సార్!"

"అంటు వ్యాధులింకా తగల్లేదు సార్!"

పునరావాస కేంద్రం ముందుకొచ్చారు మంత్రిగారు.

రాబోయే ప్రమాదం ముందే ఊహించి వీళ్లందర్నీ ఇక్కడికి లారీల మీద

చేర్చాం సార్!

"వీళ్లంతా అదృష్టవంతులు సార్ అక్కడే ఉంటే ఈ పాటికి కొట్టుకుపోయేవారు సార్!"

అధికారుల ఇకిలింతలు. కార్యకర్తల సకిలింపులు.

"చంటి పిల్లలు పాలులేక ఏడుస్తున్నారండీ.. ఆకలితో చస్తున్నారండీ..." అని చెబుదామనుకున్న పైడిరాజు నాపేసిందో పోలీసు లాఠీ. ముందుకు పోనివ్వలేదు.

"మిమ్ముల్ని చూస్తుంటే నా గుండెలు తరుక్కుపోతున్నాయి. మీ కష్టాలు నా కష్టాలుగా భావిస్తూ నా ప్రగాఢ సానుభూతి తెలుపుకుంటున్నాను. మీకేం కావాలో మాకు బాగా తెలుసు. అన్నీ పంపిస్తాం.." చిన్న ఉపన్యాసమిచ్చి కారెక్కారు మంత్రిగారు.

"దయచేసి నన్ను పోనియ్ పోలీసు బాయీ!" దేవేరించాడు పైడిరాజు.

"ఎందుకురా రాస్కెల్? పింజారీ వెధవలంతా మంత్రిగార్కి స్వయంగా కలవాలా?"

"అది కాదండీ.."

"మొహమ్మీద ఉమ్మేస్తా భడవా. నీ తాహతెంతని మంత్రిని కలుస్తావురా దొంగ నాయాల!" లాఠీ గాల్లోకి లేచింది.

"కాదండీ, నాకో చంటి గుడ్డుందండీ. దానికి మూ్రోజుల నుండి పాల్లేవండి. తల్లిపాలు కూడా లేవండీ..."

'ఐతే మంత్రిగారొచ్చి పాలివ్వాలా పుండాకోర్!" గాల్లోకి లేచిన లాఠీ పైడిరాజు వీపు మీద పడలేదు. మెడమీద పడింది. ఒక్క తోపుకు కింద పడిపోయాడు. మొహం నిండా రక్తం. అశక్తత అవహించింది.

"పాలపొడి అడుగుతానండీ... అంటూ లేచే లోగా మాయమయాడు పోలీసు.

ఆకాశాన్ని మబ్బులు కమ్మేస్తున్నాయి. జీబులు జెట్ విమానాలయాయి. పైడిరాజు శరీరం తూలుతుంది. నీటి తెరలు కళ్లను మసకబరిచాయి. వర్షం మళ్లీ తన ఉనికి తెలుపుకుంటూంది. కొన్ని సంవత్సరాల నుండి బాధపడుతూన్న క్షయ రోగిలా సముద్రం మూల్గుతూంది.

చలిగాలి చూరుకు తలకొట్టుకుంటూంటే మాగన్ను నిద్ర మాయమైంది.

ఉదయపు కలువలా, రాత్రి కమలంలా నీరసంగా ఉన్న గంగ కళ్లల్లో

భయం పేరుకు పోతుంది. పాప నిస్త్రాణగా పడుకునుంది. నాల్గోరోజు ఉదయం హెలీకాప్టర్ పొట్లాలు విసిరేసింది. కాలే కడుపుల్లోకి పులిహోర వెళ్తుంటే రేపు ముఖ్యమంత్రి గారొస్తున్నారనే వార్త వినబడింది.

పాపకు పాలులేవు. దొరికిన నీరు పట్టగానే కాస్త శక్తి వచ్చింది కాబోలు చిన్నగా ఏడుపు లంకించుకుంది.

★ ★ ★ ★ ★

నాల్గోరోజు భయంకరంగా గడిచింది.

ఐదో రోజు వర్షం తగ్గాక ఆహారం పొట్లాలు జీబుల్లో వచ్చాయి. గంగ, పైడిరాజు పొట్లాలు తినేశారు. పాప నిస్సత్తువగా పడుకుంది. కళ్లు సగం మూసుకుంది. ఏడ్చేందుకు విఫల ప్రయత్నం చేస్తూంది.

ఈ తుఫాను ఇంకెన్ని రోజులుంటుందో!

పాపనెలా దక్కించుకోవాలో... ఛచ.... పాపకేం గాదు!

మళ్లీ వేటకు వెళ్లగలనా! పాపను, గంగను సాకగలనా!

ఇంతకీ నా పాక ఎట్లుందో! ఎప్పుడో కొట్టుకు పోయుంటుంది. పోయింతర్వాత ఎక్కడుండాలి?... తాగుడు మానెయ్యాలి... డబ్బు వెనకెయ్యాలి.. సముద్రానికి దూరంగా పక్కా ఇల్లు కట్టుకోవాలి. పాపను బాగా చదివించాలి. గంగను సుఖపెట్టాలి. కొన్ని వేల రూపాయలు కూడబెట్టి ఏదన్నా వ్యాపారం చెయ్యాలి. కత్తిమీది సాములాంటి వేటను ఒగ్గెయ్యాలి.

పైడిరాజులో ఆలోచనలు పాముల్లా మెలికలు తిరిగిపోతున్నాయి.

"పాపను చూస్తే భయమేస్తుందండీ!" బావురుమంది గంగ.

"సార్, సార్" దీనంగా పిలిచాడు పైడిరాజు. ఆహార పొట్లాలు పంచిన ఆఫీసర్ను.

"ఏంటీ పొట్లమిచ్చాను గదా! అది తినేసి మరోటి అడుగుతున్నావా?" విల్లమేక ముందు పొగరువులిలాగయాడు ఆఫీసరు." ఇచ్చినంత సరిపెట్టుకోవాలోయ్. ఇచ్చినోడికే మళ్లీ ఇస్తే అందరికెట్లా సర్ది చావాలి? మీ బాబు గాడి సొమ్మేమన్నా దాచుంచారా ఇక్కడ?" కస్సుమన్నాడు.

"కాదాసార్"

"మరి'

'మా పాపకు నాల్రోజుల్నుండి పాలు లేవండీ, కాసింత పాలుపొడి ఇప్పించండి సార్"

"అంత మాటంటావురా వెధవా!" అన్నట్టుగా ఆఫీసర్ కనుబొమ్మలు పైకెగిరాయి.

"ఇంకా పాలపొడి రాలేదు." కొరకొరా చూస్తూ, వస్తే పట్టుకురామూ? మీరడిగే దాకా ఉరుకుంటామా లేక అమ్ముకుంటామా? అరె... పొద్దట్నుంచీ తిప్పలబడి సప్లై చేస్తుంటే మమ్మల్ని పాపమనే మానవుడే లేడే." దులిపేశాడు.

"అది కాద్సార్!" జట్టు పీక్కున్నాడు పైడిరాజు.

"ఏది కాదటా?"

"మూన్నెళ్ల చంటిది సార్ పాలు లేకపోతే..."

"చస్తే చస్తుంది.ఎవడి గండం ఎవడి పిండం? మేమేం చెయ్యాలి. ఎందరికని సమాధానమివ్వాలి? ఛీఛీ వెధవ ఉద్యోగమైపోయింది."

★ ★ ★ ★ ★

ఆరో రోజు....

వరద పూర్తిగా తగ్గింది. ప్రకృతి భీభత్సానికి భయపడిన సూర్యుడు మబ్బు పరదాల్లోంచి మెల్లిగా బయటికొస్తున్నాడు.

పునరావాస కేంద్రములోని వేల గుండె చెరువులకెప్పుడో గండ్లు పడ్డాయి.

నా ఇల్లెలా ఉందో....

నా పొలమెలా గుందో...

నా పశువులున్నాయో, కొట్టుకు పోయాయో!

పక్కూరిలో మా అమ్మ యెలా గుందో!

మా చిన్నోడింకా కనబడలేదు...

మా అయ్య బ్రతికున్నాడో, చచ్చాడో...

ఎవరి ఆరాటం వారిది ఒకరిదొకరు వినిపించుకునేట్లు లేరు.

"ఏవండీ... పాప!" గుడ్లు తేలేసిన పాపను చూచి గట్టిగా అరిచింది గంగ.

ఎలాగైనా సరే, ముఖ్యమంత్రిగారు రాగానే పాలపొడి అడిగెయ్యాలని నిర్ణయించుకున్న పైడిరాజు గాబరాగా పాప వైపు మళ్లాడు.

పాపలో కదలిక లేదు. ముక్కు ముందు వేలుంచి చూశాడు. శ్వాస ఆడుతున్నట్టు లేదు. పాప ఛాతీకి చెవి ఆనించి చూచి బెంబేలెత్తిపోయాడు.

"అయ్యో, అయ్యోయ్యో, నా పాప, నా పాప...!" అరిచాడు పిచ్చివాడిలా.

కేక విన్న ఓ పెద్ద మనిషి పరుగెత్తుకొచ్చాడు. పాప ఒళ్లంతా తడిమాడు. పెదవి విరిచి "పాపం చచ్చిపోయింది" తేల్చేశాడు.

గంగ గుండె కవాటం ఢామ్మని పేలింది. పైడిరాజు మెదడు పొరల్లో కత్తికోతలు, కళ్లు బైర్లు కమ్మి పడిపోయాడు. నీళ్లు చల్లారెవరో మొహమ్మీద. లేచి గుండెలు బాదుకున్నాడు.

నిర్జీవమైన పాపను గుండెలకు హత్తుకుంటూ గోడు గోడుమంటున్నారిద్దరూ.

ముఖ్యమంత్రిగారొచ్చరటా.

పదండి.. పదండి.. పదండెహె... పొట్లాలిస్తారటా...

తొక్కిసలాట ప్రారంభమైంది.

ప్రతిపక్ష నాయకుడు గూడా వచ్చాడప్పుడే.

ఊ నడవండీ... పదా... ఏయ్ పదా... జరుగు...జరుగయ్యా...

ఎటు పోవాలో, ఎవరి నడగాలో తెలియని దైవోపహతుల ఆక్రందన నల్లంత దూరం నుండే వింటున్నాడు ముఖ్యమంత్రి. అధికారులతో చర్చిస్తున్నారు. పది నిమిషాల తర్వాత జనంలో కొచ్చారు.

"మీకందరికీ పులిహోర పొట్లాలందుతున్నాయా?"

"రోజుకోసారి అందుతున్నాయండి."

"నీళ్లందుతున్నాయా?"

"మా బాగా అందుతున్నాయండీ"

"పాలపొడి అందిందా?"

"అందిందండీ" గుంపులోంచి అన్నాడో అధికారి.

"ఇహ మీ ఇళ్ల కెల్తారా?"

"వెళ్లి ఏం చెయ్యాలి బాబూ! కొంపా గోడూ ఉంటే గదా..." గొల్లుమన్నారెందరో...

రోదనలు, హాహాకారాలు మిన్నంటాయి.

హృదయ విదారక దృశ్యం ముఖ్యమంత్రి గుండెను కదిలించింది. కనుకొలుకుల్లో మెరుస్తున్న నీటి బిందువులు బయటికి రానంటున్నాయి.

"ప్రకృతి మన మీద పగబట్టింది. మీ బాధలకూ, ఆర్తనాదాలకూ నా గుండె నీరైపోయింది. మిమ్ముల్నెలా ఊరడించాలో నాకర్థం అవడం లేదు. ఎలాగైతేనేం మిమ్మల్ని అన్ని విధాలా ఆదుకుంటాం. ప్రతి కుటుంబానికి ఇరవై కిలోల బియ్యం ఉచితంగా ఇస్తాం తీసుకెళ్లండి. వాటి వెంట జనతా వస్త్రాలు గూడా ఉచితంగా ఇస్తాం పట్టు కెళ్లండి" ఆ పైన మాట్లాడలేక పోయారు ముఖ్యమంత్రి.

ప్రతి పక్ష నాయకుడు మరో పక్క జనాలను పరామర్శించాడు. ధైర్యం

నూరిపోసాడు. వెళ్లే ముందు ముఖ్యమంత్రి విలేకరులతో ముచ్చటిస్తూ "ప్రకృతి వైపరీత్యానికి గురైన ప్రజల నాదుకునేందుకు ప్రభుత్వం శక్తికి మించి సహాయ కార్యక్రమాలు చేపట్టింది. నిరాశ్రయులందరికీ ఆహార పొట్లాలూ, మంచినీటి పాకెట్లూ పంచాం. వైద్య సిబ్బందిని వెంటనే పంపిస్తా. అదృష్ట వశాత్తు మనుష్యులెవ్వరూ చావలేదు. దానిక్కారణం మేము తీసుకున్న జాగ్రత్తలే. పిల్లలకు పాలపొడి గూడా పంపి మరీ ఆదుకున్నాం." సగర్వంగా సెలవిచ్చారు.

"మీ అభిప్రాయమేమిటి సార్?" ప్రతిపక్ష నాయకుడిని ప్రశ్నించారు విలేకరులు.

"మా ప్రభుత్వం అధికారంలో ఉండగా ధర్మాన్ని నాల్గుపాదాల నడిపించాం." ప్రతిపక్ష నాయకుడందుకున్నాడు. అందుకే మా హయాంలో ప్రకృతి ప్రకోపించలేదు. ప్రస్తుతం అధికారం చలాయిస్తున్న ప్రభుత్వం ప్రజల ఆశల్ని వమ్ము చేసింది. ధర్మ దేవత గాయపడింది. అందుకే ప్రకృతి కన్నెర్ర జేసింది. కొంపా గోడూ ముంచేసింది. నిరాశ్రయులకు ఆహార పొట్లాలు అందించడంలో అనవసరమైన జాప్యం జరిగి అవినీతి చోటు చేసుకుంది. ముక్కిపోయిన బియ్యం, బూజుబట్టిన చింతపండుతో పులిహోరు తయారుచేసి సప్లై చేశారు. పాలపొడి సరిపోయేంత పంచలేదు. ఇప్పటికీ ఒక్క వైద్యుడు కూడా రాలేదిక్కడికి. మనుషులు చావనంత మాత్రాన అంతా సక్రమంగా చేశారనడానికి వీల్లేదు."

ముఖ్యమంత్రి , ప్రతిపక్షనాయకుని ఉపన్యాసాలేవీ కేంద్రము జాడల కెళ్లలేదు. సప్లై చెయ్యాల్సిన పాలపొడి డబ్బాలు రాజధానిలోనే చేతులు మారిన సంగతి ఇద్దరికీ తెలీదు.

బాధలన్నీ మరచి శాశ్వత నిద్రలోకి జారుకున్న ముక్కు పచ్చలారని చిన్నారి బుగ్గలు తడుముతూ తరిచి తరిచి ఏడుస్తున్న గంగ, పైడిరాజుల గొంతులు బొంగారు బోయాయి. వారికీ లోకమంతా చీకటిగా కనబడుతూంది.

(ఆంధ్రభూమి, మాసపత్రిక, ఫిబ్రవరి 92)